క్లుప్తంగా

ఎన్నికల నిర్వహణ భేష్



కమిషనర్ వెంకట్రావును సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

బోట్‌క్లబ్: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సజావుగా నిర్వహించిన నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కాకినాడ కార్పొరేషన్ కమిషనర్ జె.వెంకట్రావును బీజేపీ నాయకులు గురువారం సత్కరించారు. బీజేపీ కాకినాడ అసెంబ్లీ కన్వీనర్ ఇంజినీర్ గట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయంలో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కాకినాడ అసెంబ్లీ కో కన్వీనర్ కొండేటి గంగాధర్, మండల అధ్యక్షులు గాలిదేవర శేఖర్, సంఘాని సత్యం, చెక్క రమేష్, షేక్ వల్లి, కాకినాడ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు మేడ విజయలక్ష్మి పాల్గొన్నారు.

రాజకీయ దాడులు అరికట్టాలి

బోట్‌క్లబ్: రాజకీయ దాడులను వెంటనే అరికట్టాలని పౌరసంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఏ ప్రభుత్వం ఏర్పాటైనా పరస్పర రాజకీయ దాడులు కొనసాగడం, హత్యలకు మరణాలకు దారితీయడం, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు, విగ్రహాలు ధ్వంసం చేసుకోవడం మంచిదికాదన్నారు. ఎన్నికల అనంతరం 24 గంటల్లో అన్ని జిల్లాల్లోనూ భయానక పరిస్థితులు నెలకొనడం బాధకరమన్నారు. ప్రజల ప్రాణాలకు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు సచివాలయాలకు, ఆర్బీకేలపై, విగ్రహాలపై దాడుల పర్వం కొనసాగకుండా శాంతి భద్రతల రక్షణ చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలి

బోట్‌క్లబ్: ఇటీవల ఎన్నికల్లో విజయం సాధించిన నాయకులు ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలని ఆంధ్ర కాపు సద్భావన సంఘం ప్రధాన కార్యదర్శి చిట్నీడి శ్రీనివాస్ కోరారు. కాకినాడలోని ఆయన నివాసంలో గురువారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కాపులు పోటీ చేసిన నియోజకర్గాల్లో వారి విజయానికి కృషి చేసిన కాపు నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పిఠాపురం ఎమ్మెల్యేగా పోటీచేసి విజయం సాధించిన పవన్‌కల్యాణ్ జిల్లా అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని ఆయన ఆకాంక్షను వ్యక్తం చేశారు. పిఠాపురం నియోజవర్గాన్ని అన్ని రంగాల్లోను అభివృద్ధి చేయాలని కోరారు.

ముగిసిన భక్తాంజనేయుని వార్షికోత్సవాలు



గొల్లప్రోలు: మండలంలోని చేబ్రోలు గ్రామంలో ఘనంగా భక్తాంజనేయ స్వామి వార్షికోత్సవాలు నిర్వహించారు. హనుమత్ జయంతిని పురస్కరించుకుని చేబ్రోలు ఈబీసీ కాలనీలోని ఆంజనేయ స్వామి గుడి వద్ద జరుగుతున్న వార్షికోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆంజనేయస్వామికి విఘ్నేశ్వర పూజ, లక్ష్మీగణపతి హోమం, తమలపాకులు, సింధూరంతో పూజలు నిర్వహించారు. అనంతరం భజన కార్యక్రమాలు జరిగాయి. ఆలయ కమిటీ భక్తుల సహకారంతో భారీ అన్న సమారాధన జరిగింది. పరిసర గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి, అన్న ప్రసాదాలను స్వీకరించారు.

స్వీయ రక్షణకు స్విమ్మింగ్

- డీఎస్‌ఏ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ
- వ్యాయామంతో పాటు ఆరోగ్యం



కాకినాడ డీఎస్‌ఏ స్విమ్మింగ్ పూల్‌లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): వేసవి సెలవులు.. అభిరుచులకు అనుగుణంగా చిన్నారులను తీర్చిదిద్దేందుకు వీలుండే రోజులు. పుస్తకాలతో నిరంతరం కుస్తీ పట్టే పిల్లలను ఆసక్తి ఉన్న రంగాల్లో శిక్షణ ఇప్పించి నైపుణ్యానికి పదును పెట్టేందుకు దోహదపడే సమయం. వేసవి సెలవుల్లో లలిత కళలు, డ్యాన్స్ , మ్యూజిక్, క్రీడల వంటివి నేర్చుకుంటూ సంతోషంగా గడపాలనుకునే వారి జాబితాలో ఇప్పుడు స్విమ్మింగ్ కూడా చేరింది. చెరువుల్లో, సముద్రంలో, బావుల్లో, కాలువల్లో, నదుల్లో సరదాగా స్నానానికి దిగి ప్రమాదవశాత్తు పడి ప్రాణాలు కోల్పోయే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో స్వీయ రక్షణకు ఈత (స్విమ్మింగ్) తెలియాల్సిన అవసరం ఉంది. ఈత శరీరానికి కావల్సిన వ్యాయామం కూడా అందిస్తుంది.

డీఎస్‌ఏ ఆధ్వర్యంలో..

జిల్లా క్రీడా మైదానంలోని స్విమ్మింగ్ పూల్‌లో ఈ ఏడాది స్విమ్మింగ్ శిక్షణలో చిన్నారులు చేరుతున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో కనబరచాలనే లక్ష్యంతో వేసవి స్విమ్మింగ్‌లో శిక్షణలో చేరుతున్నారు. స్విమ్మింగ్ కోచ్ అప్పలనాయుడు ఆధ్వర్యంలో, డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ పర్యవేక్షణలో నిర్వహించే శిక్షణకు సమారు 173 మంది ఈ చేరారు. ఉదయం 5.30 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 7 వరకు శిక్షణ అందిస్తున్నారు. ప్రత్యేకంగా మహిళలకు సాయంత్రం 4 నుంచి 5 వరకు పూల్‌ను కేటాయించారు. శిక్షణలో చేరిన వారికి ఫిట్‌నెస్‌తో పాటు ఫ్రీ స్టైల్, బటర్‌ఫ్లై, బ్యాక్‌స్ట్రోక్, బ్రెస్ట్‌స్ట్రోక్‌లో శిక్షణ ఇస్తూ మెళకువలు నేర్పుతున్నారు. డీఎస్‌ఏలో చిన్న పిల్లలకు నెలకు రూ.1000, పెద్ద వారికి నెలకు రూ.1500 రుసుము చెల్లించాలి. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది శిక్షణలో చేరిన వారి సంఖ్య పెరిగిందని నిర్వాహకులు చెబుతున్నారు.

మంచి వ్యాయామం....

- ఈత సాధన చేసే సమయంలో శరీరంలోని అన్ని రకాల కండరాలు, కీళ్ల కదులుతాయి.
- దీని వల్ల శరీరానికి వ్యాయామం అవుతుంది.
- ఊపిరి ఎక్కువ సేపు బిగబట్టి వదలడం వల్ల ఊపితిత్తులు బలంగా తయారవుతాయి.
- పగలు ఏ సమయంలో ఈత నేర్చుకున్నా మంచిదే.
- ఈత వల్ల అనేక రకాల క్యాలరీలు ఖర్చవుతాయి. ఆకలి పెరుగుతుంది.
- నిత్యం ఈత కొట్టేవారు ఉత్సాహంగా ఉంటారు. మెదడు చురుకుగా పనిచేస్తుంది.
- శరీరం దృఢంగా ఉంటుంది. చదివిన విషయాలను త్వరగా నేర్చుకోగలుగుతారు. చిన్న వయసు వారి నుంచి పెద్ద వయసు వారి వరకు ఈత నేర్చుకోవచ్చు.
- కొలనులో నేర్చుకునే వారు రు.500 వెచ్చిస్తే మంచి స్విమ్మింగ్ దుస్తులు లభిస్తాయి.
- మూడు వారాలు క్రమం తప్పకుండా నేర్చుకుంటే ప్రావీణ్యం వస్తుంది.

ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి

చిన్నతనం నుంచి స్విమింగ్ నేర్చుకోవడం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. ముఖ్యంగా ఊపిరితిత్తులు ఆరోగ్యంగా ఉంటాయి. శరీరానికి ఆక్సిజన్ అందుతుంది. రక్తం సరఫరా మెరుగుపడి వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. మన స్నేహితులు, బంధువులు ప్రమాదవశాత్తు నీటిలో పడిపోతే ఈత వస్తే వారిని రక్షించుకోచ్చు.

– డీఎస్‌ఏ కోచ్ అప్పలనాయుడు

శిక్షణను సద్వినియోగం చేసుకోండి



కాకినాడ జిల్లా క్రీడామైదానంలోని స్విమింగ్ పూల్‌లో వేసవి శిక్షణతో పాటు నిరంతర శిక్షణ కొనసాగుతుంది. నైపుణ్యం కలిగిన కోచ్, అసిస్టెంట్ కోచ్ సహాయంతో శిక్షణ అందిస్తున్నాం. ఆసక్తి గల వారు 8919642248 నెంబరులో సంప్రదించాలి.

– బి.శ్రీనివాస్‌కుమార్, డీఎస్‌డీఓ, కాకినాడ డీఎస్‌ఏ

ఒలింపిక్స్‌లో పతకం సాధిస్తా



నా పేరు పల్లవి. ఆరో తరగతి చదువుతున్నా. పెద్దాపురం మున్సిపల్ స్కూల్‌లో చదువుతూ స్విమ్మింగ్‌కు రోజు కాకినాడ వస్తాను. ఐదేళ్ల వయసు నుంచి నేర్చుకుంటున్నాను. ఒలింపిక్స్‌లో పతకం సాధించడం నా లక్ష్యం.

మైకేల్ ఫెల్ప్స్ స్ఫూర్తితోనే..



నాపేరు కౌశిక్ వర్ధన్. నేను అంతర్జాతీయ స్విమ్మింగ్ క్రీడాకారుడు మైకేల్ ఫెల్ప్స్‌ను టీవీలో చూసి కాకినాడ డీఎస్‌ఏలో స్విమింగ్‌కు చేరాను. జాతీయస్థాయిలో పతకం సాధించడం నాలక్ష్యం. ఇక్కడ శిక్షణ బాగుంది.

‘ఆదిత్య’లో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఈ ఏడాది నుంచి సెంటర్ ఫర్ రీసెర్చ్ ఇన్ స్కీమ్ అండ్ పాలిటిక్స్ ఆధ్వర్యంలో కొత్త స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు నిర్వహిస్తున్నట్లు విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి గురువారం తెలిపారు. ఆదిత్య బ్రాంచ్‌లైన కాకినాడ, రాజమహేంద్రవరంలో బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీస్ ఇన్సూరెన్స్, వైజాగ్ బ్రాంచ్‌లో లాజిస్టిక్స్, గాజువాకలో రిటైల్ మేనేజ్‌మెంట్, శ్రీకాకుళం బ్రాంచ్‌లో బ్యాంకింగ్ ఫైనాన్స్ కోర్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కోర్సు అభ్యసించే విద్యార్థులు అఖరి సంవత్సరంలో ఉండగా నెలకు రూ.7500 నుంచి 15 వేల వరకూ ఇంటర్న్‌షిప్ వస్తుందని, ఇతర వివరాలకు సమీప కళాశాల ప్రిన్సిపాళ్లను సంప్రదించవచ్చన్నారు.

కూటమి విజయంలో విశ్రాంత ఉద్యోగులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): రాష్ట్ర పార్లమెంట్, శాసనసభ ఎన్నికలలో కూటమి ఘన విజయం సాధించడంలో రాష్ట్ర రిటైర్డ్ ఎంప్లాయీస్ సంఘ కార్యవర్గం, సభ్యుల పాత్ర ఉందని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పీఎస్ఎస్ఎన్‌పీ శాస్త్రి తెలిపారు. గురువారం కాకినాడలోని పెన్షనర్స్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు, పవన్‌కల్యాణ్, పురందేశ్వరిలకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన ప్రభుత్వానికి అన్ని ఉద్యోగ సంఘాలతో పాటు, పింఛనుదారులు పూర్తి సహాయ సహకారాలు అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడు కె.పద్మనాభం, జిల్లా ప్రధాన కార్యదర్శి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

సర్పవరం ఆలయ ట్రస్ట్ బోర్డు రాజీనామా

- వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాకపోవడంతో బాధ్యతల నుంచి తప్పుకుంటున్నాం
- చైర్మన్ పుల్ల నారాయణరావు



ఈఓ భీమేశ్వరరావుకు రాజీనామా పత్రాన్ని సమర్పిస్తున్న ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ నారాయణరావు, సభ్యులు

కాకినాడ రూరల్: సర్పవరం గ్రామంలోని రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు కమిటీ తమ పదవులకు రాజీనామా చేసింది. ఆలయ ప్రాంగణంలో రాజీనామా పత్రాన్ని చైర్మన్ పుల్ల నారాయణరావు, సభ్యులు పి.వీరలక్ష్మి, పుల్ల వీర వెంకట సత్యనారాయణ, జోకా సత్తిబాబు, శీలా అప్పారావు, పులగల మరిడమ్మ, జి.భద్రినారాయణ గురువారం ఉదయం ఈఓ భీమేశ్వరరావుకు అందించారు. అనంతరం చైర్మన్ పుల్ల నారాయణ రావు మీడియాతో మాట్లాడుతూ మే 13న జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఓటమి చెందడంతో తమ ట్రస్ట్ బోర్డు సభ్యులమంతా బాధ్యతల నుంచి తప్పుకుంటూ ఈఓకు రాజీనామా పత్రం సమర్పించామన్నారు. 2023 జనవరి 22న తాను చైర్మన్‌గాను, మిగిలిన వారు సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశామని నారాయణరావు తెలిపారు. మాజీ మంత్రి కురసాల కన్నబాబు గ్రామస్తుల సూచనలు మేరకు తమ కమిటీని నియమించి, తనను చైర్మన్‌గా చేశారని జీవితంలో ఇంత గొప్ప పదవి వస్తుందని ఎప్పుడూ అనుకోలేదన్నారు. ఇందుకు ఆయనకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్టు తెలిపారు. తమ ట్రస్ట్ బోర్డు ప్రమాణ స్వీకారం చేసిన నుంచి నేటి వరకు ప్రతి ఆదివారం సుమారు 1500 మందికి అన్న ప్రసాదం అందించామని, భక్తులు, గ్రామస్తులు, దాతలు, నాయకుల సహకారంతో విజయవంతంగా అన్నదానం చేయగలిగామన్నారు. తాము బాధ్యతలు చేపట్టే సరికి స్వామి వారి ఆదాయం రూ.39 లక్షలు ఉండేదని, 2024 మార్చి నాటికి రూ.83 లక్షలకు చేరిందన్నారు. ఈఓ భీమేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, సిబ్బంది లక్ష్మణ్, చందు, అర్చక స్వాములు, ట్రస్ట్ బోర్డు సభ్యులు కష్టపడి పనిచేయడంతో ఇది సాధ్యమైందన్నారు. దేవస్థానానికి చెందిన రెండు ఎకరాల పొలంలో గోశాల నిమిత్తం చెరువు తవ్వామన్నారు. ఉత్తర ద్వారం నుంచి తూర్పు దారికి వచ్చే మార్గం ఇరుకుగా ఉండడంతో రెండు అడుగుల మేర వెడల్పు చేశామన్నారు. దాత జగదీష్ సహకారంతో ఎలక్ట్రికల్ పోల్స్ ఏర్పాటు చేశామన్నారు. ఆలయ ప్రాంగణంలో నిత్యాన్నదానానికి సర్పవరం బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధి జోకా సత్తిబాబు ఆధ్వర్యంలో సుమారు రూ.3.5 లక్షలతో అన్నదాన షెడ్ నిర్మించామన్నారు. ఆలయం తూర్పు గోడకు చేర్చి శంఖు, చక్ర, నామాలు, ఆంజనేయ స్వామి, గరుత్మంతుడి విగ్రహాలను తన సొంత నిధులతో ఏర్పాటు చేసినట్టు నారాయణరావు తెలిపారు. 14 నెలల పదవీ కాలంలో రెండు ముక్కోటి ఏకాదశిలు, రెండు మాఘ మాస ఉత్సవాలు, రెండు వార్షిక కల్యాణోత్సవాలు నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. స్వామి ఆలయానికి చెందిన ఆస్తులు అన్యాక్రాంతానికి గురయ్యాయని గుర్తించి తమ కమిటీ వచ్చిన తరువాత ఆస్తుల పరిరక్షణకు నడుం బిగించి దేవస్థానం ప్రోపర్టీస్‌లోకి రెండు ఆస్తులు ఎక్కించేందుకు కృషి చేశామన్నారు. తిమ్మాపురంలో 21/2లో 8.45 ఎకరాలు, పనసపాడులో సర్వేనంబరు 256/1లో 2.34ఎకరాల భూమి వారం రోజులు క్రితమే దేవస్థానం ప్రోపర్టీస్ లిస్ట్‌లోకి వచ్చాయన్నారు. ఆలయ తూర్పు వైపు ఆగ్నేయంలోని గోడ కూలిపోడంతో దాని నిర్మాణానికి అధికారులను కోరామని, అనుమతి ఇవ్వలేదన్నారు. తమకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.

ముగిసిన అవగాహన తరగతులు



ఉపాధ్యాయులకు జ్ఞాపికలు అందజేస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ: పదో తరగతిలో ప్రవేశించిన విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో మే 21న కాకినాడ యూటీఎఫ్ హోమ్‌లో నిర్వహించిన అవగాహన తరగతులు గురువారం ముగిశాయి. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పి.గిరిధర్ గోపాల్, సీహెచ్‌వీ రమణ, టి.రవిచక్రవర్తి, కేవీపీ నగేష్, జి.ప్రభాకరవర్మ, కె.సత్తిరాజుల చేతుల మీదుగా ఉపాధ్యాయులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఫ్యాకల్టీ రమణ మాట్లాడుతూ పదో తరగతి సిలబస్ మారిన నేపథ్యంలో ఈ తరగతులు విద్యార్థులకు బాగా ఉపయోగపడ్డాయన్నారు. వివిధ సబ్జెక్టుల్లో నిపుణులైన ఉపాధ్యాయులు సెలవుల్లో కూడా తమ సమయాన్ని విద్యార్థులకు వినియోగించడం చాలా అభినందనీయమన్నారు. భవిష్యత్తులో కూడా ఈ విధమైన తరగతులు నిర్వహిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ ఉపాధ్యాయులు విశ్వేశ్వరావు, పి.ఝాన్సీ, ఎంబీఎస్ దేవి, వి.శ్రీరామారావు, మూర్తి, శ్రీనివాస్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

స్థలం తగాదాలో ఒకరికి గాయాలు

కరప: స్థలం విషయంలో ఒక కుటుంబంలో తలెత్తిన వివాదంలో ఒక వ్యక్తి గాయపడగా కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసుల కథనం మేరకు.. కరపలోని సీతమ్మవీధిలో నివాసం ఉంటున్న పెంకే లోవరాజు, శ్రీనివాస్ సోదరుల మధ్య చాలాకాలంగా 10 సెంట్ల ఇంటి స్థలం విషయంలో వివాదం జరుగుతోంది. ఈ క్రమంలో గురువారం స్థలం కోసం సోదరుల మధ్య మరోసారి గొడవ జరిగింది. ఈ తగాదాలో శ్రీనివాస్ భార్య లక్ష్మి కత్తిపీటతో లోవరాజుపై దాడి చేసి, గాయపరచింది. కుటుంబ సభ్యులు క్షతగాత్రుడిని కాకినాడ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, ఏఎస్ఐ వి.సూరిబాబు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి కూలీలకు రూ.300 వేతనం ఇవ్వాలి



లచ్చిపాలెంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఈశ్వరరావు

తాళ్లరేవు: ప్రభుత్వం ప్రకటించినట్లుగానే రోజుకు రూ.300 వేతనం ఇవ్వాలని ఉపాధి కూలీలు డిమాండ్ చేశారు. గురువారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టి.ఈశ్వరరావు, తణుకు రాజు తదితరులు జార్జిపేట, లచ్చిపాలెం, పెదబాపల్లి, తంగేటిపంపు గ్రామాల్లో ఉపాధి కూలీలను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం చెప్పినట్లుగా రూ.300 వేతనం పడడం లేదన్నారు. నిత్యవసర ధరలు పెరిగిపోయాయని కనీసం రూ.300 వేతనం రాకపోతే ఎలా బతకాలని ప్రశ్నించారు.

ఎర్ర తురాయి.. మదిని దోచెనోయ్..



ఉప్పాడ-పిఠాపురం రోడ్డులో విరబూసిన పుష్పాలు

కొత్తపల్లి: వసంత కాలంలో వివిధ రకాల చెట్లు నూతన చిగుర్లు, పుష్పాలతో కొత్త శోభను సంతరించుకుంటాయి. ఉప్పాడ–పిఠాపురం, కొత్త ఇసుకపల్లి–పాత ఇసుకపల్లి, నాగులాపల్లి–మూలపేట రోడ్లలో ప్రకృతి అందాలు కనువిందు చేస్తున్నాయి. రోడ్డుకు ఇరువైపులా విరబూసిన ఎర్ర తురాయి పూలు వాహన చోదకుల మనస్సులను దోచుకుంటున్నాయి. పచ్చటి లేత ఆకులు, ఎర్రని పూలతో ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. మండు వేసవిలో ఆకులు రాలి, నిస్తేజంగా కనిపించిన ఈ చెట్లు ప్రస్తుతం పూలు విరబూసి కనువిందు చేస్తున్నాయి.

తొలకరి కాలం.. వ్యాధుల గాలం

- పశువులకు పొంచి ఉన్న ముప్పు
- గాలికుంటు, గొంతువాపు వ్యాధుల వ్యాప్తి
- ముందస్తు టీకాలు వేయించాలంటున్న పశు వైద్యులు



పశువులకు వ్యాక్సిన్ వేస్తున్న పశు వైద్య సిబ్బంది

గొల్లప్రోలు: వర్షాకాలం వస్తుందంటే రైతుల్లో ఆందోళన, గుబులు పుట్టుకొస్తుంది. ప్రస్తుతం తొలకరి వానలు కురుస్తుండంతో పశువులకు సోకే వ్యాధులపై పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో రైతులు వ్యవసాయంతో పాటు, పాడి పరిశ్రమకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. పంట సాగులో నష్టం వచ్చినా, కరువు కమ్ముకొచ్చినా కలిగే లోటును పాడి పరిశ్రమతో పూడ్చుకొని జీవనం సాగిస్తున్నారు. అలాంటి కీలకాధారమైన పశువులకు వర్షాకాలంలో సోకే వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ఈ వర్షాకాలంలో పశువులకు గొంతు వాపు, జబ్బ వాపు, చిటుక వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. ఇవి జూన్ నుంచి సెప్టెంబర్ వరకు తొలకరి సమయంలోనే అధికంగా వ్యాప్తి చెందుతుంటాయి. ఈ వ్యాధులు సోకితే పాల దిగుబడి తగ్గడంతో పాటు, పశువులు మరణించే ప్రమాదమూ ఉంది. దీంతో పాడి రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి ఉంటుంది. వర్షాకాలంలో కలుషితమైన నీరు, మేత కారణంగా పశువులకు రోగ నిరోధక శక్తి తగ్గి, పలు వ్యాధులు సంక్రమిస్తుంటాయి. పశువులకు సోకే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. గొల్లప్రోలు మండలం, పట్టణంలో గేదెలు 14,043, ఆవులు 2,212, మేకలు 6,478, గొర్రెలు 7,919 వరకు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పశువులకు సోకే వ్యాధుల నివారణకు పశు వైద్యాధికారులు పాడి రైతులకు అనేక సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

టీకాలు తప్పనిసరి

పశువులకు వర్షాకాలంలో సోకే వ్యాధుల నివారణకు ముందస్తుగా టీకాలు తప్పనిసరిగా వేయించాలి. కొందరు రైతులు పాల దిగుబడి తగ్గిపోతుందని టీకాలు వేయించడానికి వెనకడుగు వేస్తారు. టీకాలు వేయడంతో పాల దిగుబడి తగ్గిపోతుందనేది ఓ అపోహ మాత్రమే. అలాంటిదేమీ జరగదని పశు వైద్యులు చెబుతున్నారు. వ్యాధులు ముదిరి పశువులను కోల్పోవడం కన్నా, ముందస్తు టీకాలు వేయిస్తే వ్యాధులు సోకకుండా నివారించవచ్చని వైద్యులు చెబుతున్నారు.

గొంతు వాపు వ్యాధి

వర్షాకాలంలో పశువులకు ప్రధానంగా గొంతు వాపు వ్యాధి సోకుతుంది. దీనినే గురక వ్యాధి అని కూడా అంటారు. వర్షాకాలంలో గేదెలు, ఆవులు ముఖ్యంగా దూడల్లో ఎక్కువగా ఈ వ్యాధి వ్యాపిస్తుంది. ఒక్కోసారి గొర్రెలు. మేకలు, పందుల్లో కూడా వ్యాపిస్తుంటుంది. ఇది అంటు వ్యాధి. కంటి నుంచి నీరు, నోటి నుంచి నురగ కారుతూ, గురక, శ్వాస పీల్చడం కష్టమవుతుంది. జ్వర తీవ్రత 106, 107 డిగ్రీల వరకు ఉంటుంది. గొంతు కిందకు నీరు దిగి, గొంతు వాపు వస్తుంది. ఈ వ్యాధి వచ్చిన 24 గంటల్లో పశువులు మరణించే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

నివారణ చర్యలు ఇవీ..

వర్షాకాలానికి ముందే జూన్, జూలై నెలల్లో వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి. వ్యాధి సోకిన పశువుల దొడ్డిని ఫినాయిల్, క్రిసాల్ వంటి క్రిమి సంహారక ద్రావణంతో పరిశుభ్రం చేయాలి. వ్యాధి లక్షణాలు కనిపించిన పశువును వేంటనే మందనుంచి వేరు చేయాలి. తప్పనిసరిగా పశు వైద్యాధికారిని సంప్రదించి, వైద్యం చేయించాలి.

గాలికుంటు వ్యాధి

కలుషితమైన గాలి ద్వారా ఈ వ్యాధి సోకుతుంది. తల్లి పాల ద్వారా దూడలకు సోకే అవకాశం ఉంటుంది. ఏటా వర్షకాలంలో గేదెలు, ఆవులకు వచ్చే వ్యాధుల్లో గాలికుంటు ఒకటి. గిట్టలు ఉన్న ప్రతి జీవికి ఈ వ్యాధి సోకుతుంది. వ్యాధి సోకిన సమయంలో పశువులకు 104 నుంచి 105 డిగ్రీల జ్వరం వస్తుంది. నోటిలో, గిట్టల మధ్య పుండ్లు వచ్చి పశువులు నడవలేని స్థితికి చేరుకుంటాయి. వ్యాధి సోకిన పశువులు మేత తీసుకోలేక, నీరసిస్తాయి.

నివారణ చర్యలు ఇలా..

వ్యాధి సోకిన పశువులను మంద నుంచి వేరు చేయాలి. నోటిలోని పుండ్లకు బోరిక్ పౌడర్, గ్లిజరిన్ కలిపి పూయాలి. గిట్టల మధ్య పుండ్లకు మందు ద్రావణంతో శుభ్రం చేసి వేపనూనె రాయాలి. యాంటీ బయోటిక్స్ వాడితే ఉపశమనం కులగుతుంది.

ముందస్తు టీకాలు వేయించాలి



ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పశువులకు సోకే వ్యాధులపై అప్రమత్తంగా వ్యవహరించాలి. ముందస్తు టీకాలు వేయిస్తే మంచి ఫలితం ఉంటుంది. అలాగే జాగ్రత్తలు పాటించడంలోనూ వ్యాధుల నివారణకు అవకాశం ఉంది.

– డాక్టర్ ప్రశాంత్, మండల పశు వైద్యాధికారి, గొల్లప్రోలు